క్లుప్తంగా

కారెంపూడి సర్కిల్ ఆఫీస్ తనిఖీ

కారెంపూడి: గురజాల డీఎస్పీ జగదీష్ కారెంపూడి పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. తరచూ గ్రామాలను విజిట్ చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలతో మర్యాదపూర్వకమైన సంబంధాలను పెంపొందించుకోవాలని డీఎస్పీ జగదీష్ ఈ సందర్భంగా సూచించారు. కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, కారెంపూడి ఎస్ఐ టి.వాసు, రెంటచింతల ఎస్ఐ టీసీహెచ్ నాగార్జున పాల్గొన్నారు.

మాచవరం ఎంపీడీఓ బదిలీ

ఇన్‌చార్జి ఎంపీడీఓగా వెంగళరావు


శ్రీనివాసరావు (ఫైల్)

మాచవరం: మాచవరం మండల పరిషత్ అధికారిగా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఆయన ఏపీ హైకోర్టులో జ్యుడిషియల్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇటీవల ఎంపీడీఓగా నియమితులయ్యారు. జిల్లా పరిషత్ సీఈఓ ఆదేశాల మేరకు తిరిగి సెక్షన్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న వెంగళరావుకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావును కార్యాలయ సిబ్బంది సన్మానించి, వీడ్కోలు పలికారు.

కుట్టు మిషన్లు అందజేత



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో 11 మంది మహిళలకు గురువారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు గుండా అశోక్‌బాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతోనే క్లబ్ తరపున కుట్టు మిషన్లు అందజేయటం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గుండా అశోక్‌బాబు, సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, ట్రెజరర్ డాక్టర్ గుర్రం కృష్ణకాంత్, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్.రామచంద్రమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో నిర్వహించటం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు అందరు హాజరు కావాల్సిందిగా కోరారు.


26న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

మాచర్ల : ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) పిలుపు మేరకు ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ముందు నిరసన చేపట్టనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము కిషోర్ చెప్పారు. దీనిలో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐఆర్ ప్రకటించి, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టడం జరుగుతుందన్నారు. నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గుర్తుతెలియనివ్యక్తి మృతదేహం లభ్యం

దాచేపల్లి : నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం గుర్తించారు. సుమారు 60 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతి చెంది ఉన్నట్లుగా స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పట్టణంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం



మాచర్ల : పట్టణంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పలు వార్డుల్లో పర్యటించారు. వార్డుల్లో సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, వార్డు కౌన్సిలర్లు, జి.కోటిరెడ్డి, దస్తగిరి, చందుగౌడ్, ఎం.శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రక్షకభటుల నివాసాలు

- అధ్వాన స్థితిలో పోలీసు క్వార్టర్స్
- కొన్ని సంవత్సరాలకే నివాసయోగ్యం కాకుండా పోయిన వైనం
- నివాసాల చుట్టూ పెరిగిన పిచ్చి చెట్లు


చుట్టూ పిచ్చి చెట్లు మొలిచి అధ్వానంగా ఉన్న వెల్దుర్తి పోలీసు క్వార్టర్స్

వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలో గతంలో రాష్ట్ర ప్రభుత్వం పోలీసు స్టేషన్‌తో పాటు పోలీసులు నివాసముండేందుకు పోలీసు క్వార్టర్స్ నిర్మించేందుకు రూ.62 లక్షలు మంజూరు చేసింది. 9.10.2002లో రూ.12 లక్షలతో పోలీసు స్టేషన్‌ను, రూ.50 లక్షలతో ఎస్ఐ క్వార్టర్‌తో పాటు 10 పోలీసు క్వార్టర్స్‌ను నిర్మించారు. అయితే ఈ పోలీసు క్వార్టర్స్ 10 సంవత్సరాలకే మరమ్మతులకు గురై నివాసం ఉండడానికి పనికిరాకుండా పోయాయి. ఆ క్వార్టర్స్ శిథిలావస్థకు దాదాపు 8 సంవత్సరాలుగా ఈ గృహాలలో పోలీసు సిబ్బంది నివాసం ఉండడం లేదు. అంతే కాకుండా పోలీసు క్వార్టర్స్ చుట్టూ పిచ్చి చెట్లు పెరగటంతో పాములు, పురుగు పుట్ర తిరుగుతుండటంతో స్థానిక ప్రజలు కూడా భయపడుతున్నారు. ఇక్కడ మొత్తం ఎస్ఐ సహా 21 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది గృహాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయటి గృహాలలో కొంత మంది అలాగే 20 కి.మీ.ల దూరంలో ఉన్న మాచర్ల పట్టణంలో కొంత మంది నివాసం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్వార్టర్స్‌లో తక్కువ అద్దెతో ఉండాల్సిన పోలీసు సిబ్బంది అధిక మొత్తంలో అద్దెలు చెల్లించాల్సి వస్తోంది. ఇక్కడ నిర్మించిన పోలీసు క్వార్టర్స్‌ను పడగొట్టి వాటి స్థానంలో కొత్తగా క్వార్టర్స్ నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు. స్టేషన్ పరిధిలో నివాసముండాలంటే భయంగా ఉందని వారు పేర్కొంటున్నారు. అంతే కాక నూతనంగా పోలీసు క్వార్టర్స్ నిర్మిస్తే పోలీసు సిబ్బంది స్టేషన్‌కు అందుబాటులో ఉంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేయించి క్వార్టర్స్ నిర్మించాలని పోలీసులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకుని నివాసయోగ్యం కాకుండా ఉన్న క్వార్టర్స్

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఎంపీపీ కందుల జాను
- సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా

దాచేపల్లి : అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ కందుల జాను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జాను అధ్యక్షతన సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీపీ జాను మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులతో గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని చెప్పారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలని ఆయన సూచించారు. అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని, గ్రామాల్లో జరిగే సమావేశాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులకు ముందస్తుగా సమాచారం అందించాలని ఎంపీపీ జాను అన్నారు. శీతకాలం నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, ఎంపీడీవో రామకృష్ణ, సూపరింటెండెంట్ పి.రత్నం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కందుల జాను


అధికారులు రాకపోవటంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సమావేశానికి అధికారుల డుమ్మా

ఇదిలా ఉండగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొడుతున్నారు. ఫలానా తేదీన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ముందుగానే మండల పరిషత్ కార్యాలయం నుంచి 28 శాఖల అధికారులకు సమాచారం అందిస్తున్నారు. ప్రభుత్వ అధికారులకు సమావేశపు నోటీసుల ద్వారా సమాచారం అందించి అందినట్లుగా సంతకాలు చేయించుకుంటున్నారు. అయితే ఈ సమావేశానికి అధికారుల హాజరు శాతం గణనీయంగా తగ్గింది. సుమారు 10 శాఖల అధికారులు మాత్రమే సమావేశానికి వచ్చారు. మిగతా 18 శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. అధికారులే సమావేశాలకు రాకపోతే ప్రజల సమస్యలు ఏ విధంగా చర్చకు వస్తాయని వారు అంటున్నారు. ప్రతిసారి జరిగే మండల పరిషత్ సమావేశాలకు అధికారులు నామ మాత్రంగానే వస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మండల స్థాయిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశానికి అధికారులు రాకపోవటం పట్ల ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా మండల పరిషత్ సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోని, ఎంపీపీ కందుల జాను కోరగా హాజరు కాని అధికారుల నుంచి వివరణ కోరతామని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న సీఐ వెంకట్రావు

పిడుగురాళ్ల: దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్రావు మాట్లాడుతూ మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన జంగం తిరుపతయ్య అనే వ్యక్తి పలు దొంగతనాలకు పాల్పడ్డాడన్నారు. ఇతను ఇటీవలే పాతగణేశునిపాడు గ్రామంలో రైస్ మిల్లు వెనుక తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి రాయితో తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి వస్తువులతోపాటు రూ.25 వేల నగదును దొంగలించాడని తెలిపారు. అలాగే గత 50 రోజుల క్రితం కోనంకి గ్రామంలోని ఓ ఇంట్లో బంగారం, వెండి వస్తువులను దొంగలించాడని, అదే గ్రామంలో రెండేళ్ల క్రితం కూడా దొంగతనం చేశాడని అన్నారు. బంగారం, వెండి, నగదును తీసుకొని పోవటమే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. ఇతని వద్ద నుంచి మొత్తం 58 గ్రాముల బంగారు వస్తువులు, 150 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఎం.మోమన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కౌన్సిలర్ ప్రదీప్ కుమార్

గురజాల : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని జాతీయ సైబర్ క్రైమ్ కౌన్సిలర్ కె.ప్రదీప్ కుమార్ అన్నారు. స్థానిక వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలకు గురై చాలా మంది వారి ఖాతాల్లోని డబ్బులను పోగొట్టుకుంటున్నారన్నారు. మేము బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాం మీ వివరాలు చెప్పండి.. మీకు లక్కీ డిప్ ద్వారా లాటరీ తగిలింది బ్యాంక్ వివరాలు తెలపండి.. ఇలా ఫోన్‌లు వస్తే అత్యాసకు పోయి మీ వివరాలు చెబితే మీ ఖాతాల్లోని డబ్బులు క్షణాల్లో మాయమవుతాయన్నారు. అటువంటి కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, వాటి నివారణపై అవగాహన కలిగి ఉండాలని తల్లిదండ్రులకు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు సీఐ ఆవుల భాస్కర్ మత్తు పదార్థాలు తీసుకుంటే జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వై వినోద్‌కుమార్, కళాశాల సిబ్బంది వుల్లి నారాయణ, మద్దినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ కిషోర్ బాబు తదితరులున్నారు.


మాట్లాడుతున్న సీఐ ఆవుల భాస్కర్

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మాచర్ల రూరల్: సైబర్ ప్రపంచం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదని సైబర్ నేరగాళ్లు సైబర్ క్షేత్రాన్ని దుర్వినియోగం చేస్తూ సైబర్ ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని, వీటిపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ మహమ్మద్ షఫీ అన్నారు. గురువారం మండలంలోని న్యూటన్స్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఆయన మాట్లాడారు. అక్రమంగా డబ్బులు సంపాదించాలనుకునే సైబర్ నేరగాళ్లు ఇలాంటి నేరాలకు పాల్పడతారని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కంప్యూటర్ ద్వారా టెక్నాలజీని ఉపయోగించి చేసే చట్ట వ్యతిరేకమైన చర్యలకు తీవ్రమైన శిక్షలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ఎస్ఎస్‌డీ డిపార్ట్‌మెంట్ అధికారి కొత్తపల్లి ప్రదీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకనుగుణంగా పనిచేయాలి

ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్

మాచర్ల రూరల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు ప్రజల అవసరాలకనుగుణంగా పని చేయాలని ఎంపీడీఓ ఆర్.ఫణికుమార్ నాయక్ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఎస్‌డీజీ సుస్థిర అభివృద్ధిపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గ్రామాభివృద్ధి కోసం పన్నుల శాతాన్ని పెంచటంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్థిక సంఘ నిధులు, ఉపాధి హామీ పనుల నిర్వహణ గ్రామాభివృద్ధికి ఎంత గానో దోహదపడతాయని, వీటిని అవసరమైన చోట ఉపయోగించే విధంగా తగు ప్రణాళికలు రూపొందించటంలో సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, ఏఓ శర్మ, సీడీపీఓ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

రెంటచింతల: గ్రామాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఈఓపీఆర్డీ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.సరోజినిదేవి అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, ఆరోగ్య కార్యకర్తలకు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించుటకు 9 థీమ్స్‌పై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వై.శివ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్, ఆర్ఐ పల్లా రామకృష్ణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిరపలో బొబ్బర తెగులును నివారించండి


మిర్చి పైరును పరిశీలిస్తున్న హెచ్ఓ సురేష్

వెల్దుర్తి: మండలంలోని మండాది, రచ్చమల్లపాడు గ్రామాలలో మిరప పంట పొలాలను మాచర్ల ఉద్యానవన శాఖాధికారి సురేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మిరప, పూత, కాయ ఎదుగుదల దశలో ఉందన్నారు. మిర్చి పైరులో బొబ్బర తెగులు సోకినట్లు గమనించామన్నారు. తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించామన్నారు. తెగులు, ఆకుముడత, జెమిని వైరస్‌లు తెల్లదోమ వలన వస్తుందన్నారు. నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు ఎకరాకు 20 వాడాలన్నారు. పంట పొలం చుట్టూ జొన్న, మొక్కజొన్న, బంతి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రామిరెడ్డి లింగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

తహసీల్దార్ బాషా

వెల్దుర్తి: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ బాషా అన్నారు. గురువారం మండలంలోని శిరిగిరిపాడు గ్రామ సచివాలయ ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాలలో నిర్వహించే రెవెన్యూ సదస్సులు రైతులు, భూ యజమానుల డాక్యుమెంట్స్ వెరిఫై చేసి, ఎవరైనా గ్రీవెన్స్ చేయటానికి తోడ్పడతాయన్నారు. మండలంలో రోజుకొక గ్రామంలో ఈ సదస్సు ఏర్పాటు చేయటం జరుగుతుందని సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. భూ అంశాలు, అడంగల్, 22ఏ లిస్టు, అసైన్డ్ ల్యాండ్ సమాచారం తయారు చేసి గ్రామాలకు తీసుకెళ్లటం జరుగుతుందన్నారు. రైతులు, ఇతర ల్యాండు యజమానులు వారి రికార్డులలో సరి చూసుకొని ఏమైనా తేడాలుంటే అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులు జరిగే గ్రామంలో ఆ రోజు ఫ్రీ ఆఫ్ కాస్ట్‌గా సబ్ డివిజన్, మ్యుటేషన్ కొరకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 6 అర్జీలు వచ్చాయని, అర్జీలను ఆన్‌లైన్ చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వలి, వీఆర్ఓ కొండలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబునాయక్, టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

మాచవరం: గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తునట్లు తహసీల్దారు క్షమారాణి తెలిపారు. మండలంలోని కొత్తపాలెం, తురకపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 15 దరఖాస్తులు అందినట్లు ఆమె చెప్పారు. అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.


శిరిగిరిపాడు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ బాషా


కొత్తపాలెం రెవెన్యూ సదస్సులో తహసీల్దారు క్షమారాణి, అధికారులు


మిట్టగుడిపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు


దాచేపల్లి రెవెన్యూ సదస్సులో అరర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ కుటుంబరావు

భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

మిట్టగుడిపాడు(రెంటచింతల): ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా నీటివనరుల శాఖ సహాయ అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో సర్పంచ్ గొట్టె ప్రమీలాగురవారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల భూ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే క్షేత్రస్థాయిలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అర్జీలు ఇచ్చిన 45 రోజులలో సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు 23 అర్జీలు అందచేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ పిన్నెం బ్రహ్మయ్య తెలిపారు. ఈ సదస్సులో ఎండోమెంట్ ఆర్ఐ పల్లా రామకృష్ణ, ఈఓ గాదె రామిరెడ్డి, వీఆర్వో కాశయ్య, సర్వేయర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 42 అర్జీలు

దాచేపల్లి : నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ వైవీ కుటుంబరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలపై 42 అర్జీలు రైతులు అందించారని తహసీల్దార్ కుటుంబరావు చెప్పారు. అర్జీలను పరిశీలన చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సదస్సులో కమిషనర్ ఎంపీ అప్పారావు, డీసీ చైర్మన్ పగడాల భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మాజీ సర్పంచ్ షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.

పూడ్చివేసిన గుంత



సాక్షి ఎఫెక్ట్

పిడుగురాళ్ల: పట్టణం ఐలాండ్ సెంటర్‌లోని జానపాడు రోడ్డు వైపు వెళ్లే మార్గంలో మున్సిపల్ అధికారులు వాటర్ పైపు లైన్ మరమ్మతులకు గుంతను తీసి 5, 6 రోజులు అయినా పూడ్చలేదు. అయితే దీనిపై గురువారం సాక్షి దినపత్రికలో 'గుంత ఉంది.. జాగ్రత్త..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు వెంటనే వాటర్ పైపులైన్‌కు మరమ్మతులు చేసి శుక్రవారం గుంతను పూడ్చివేశారు. దీంతో పట్టణ ప్రజలు సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మాచర్ల : ఆధార్‌లో మార్పులు, చేర్పులు, నూతన ఆధార్ నమోదు తదితర వాటికి శుక్రవారంతో గడువు ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు చెప్పారు. పట్టణంలోని బ్యాంకు కాలనీతోపాటు, సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆస్తి పన్నుల వ్యత్యాసాలకు సంబంధించి ప్రత్యేక సర్వే

పట్టణంలో ఆస్తి పన్నుల్లో వ్యత్యాసాలు ఉన్న నేపథ్యంలో సమస్యలు ఉన్న భవనాలను పరిశీలించడం జరుగుతోందన్నారు. ఖాళీ స్థలాలు, భవనాల అంచనాలు సిద్ధం చేసి పన్ను తక్కువ, ఎక్కువ విషయాలు పరిశీలించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ఆధారంగా సంబంధిత అధికారులకు నివేదిక అందజేయడం జరుగుతుందన్నారు. పట్టణంలోని 16 సచివాలయాల అధికారులు, సిబ్బంది, పురపాలక సంఘ ఆర్వో పూర్ణచంద్రరావు, ఆర్ఐ వెంగయ్య, సంబంధిత అధికారులతో సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పులిపాడులో పర్యటించిన జిల్లా కలెక్టర్

గురజాల రూరల్ : జనవరి 1వ తేదీన సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు పరిశీలించారు. హెలిప్యాడ్‌తో పాటు వాహనాల పార్కింగ్‌కు స్థలాలను, బహిరంగ సభకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ కె.నగేష్, డీఎస్పీ బి.జగదీష్, సీఐ ఆవుల భాస్కర్‌తో పాటు మండల రెవెన్యూ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్

ధనుర్మాస ప్రత్యేక పూజలు

మాచర్ల : పట్టణంలోనిలో బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం ధనుర్మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణం నుంచి పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు, భక్తులు భజనలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిరిడీ సాయి ఆలయంలో గురువారం భక్తులు ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని సాయినాథునికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.